## క్లుప్తంగా

### కోర్టులో జనరేటర్ ఏర్పాటు



జనరేటర్‌ను ప్రారంభిస్తున్న జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం జిల్లా కోర్టులో నూతనంగా ఏర్పాటు చేసిన జనరేటర్‌ను శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్య నారాయణ, చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్త మరావు, పోసాని రాధాకృష్ణమూర్తి, న్యాయ వాదులు, న్యాయశాఖ సిబ్బంది, ఏఓ మోహన్ దాస్, జె.కిరణ్ పాల్గొన్నారు.

### లంబాడీలు ఐక్యంగా ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న బాలునాయక్

పాల్వంచ: లంబాడీలు ఐక్యంగా హక్కులు సాధించుకోవాలని గాంధీనగర్ లంబాడీల గౌరవ అధ్యక్షుడు బానోతు బాలు నాయక్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణ పరిధిలోని నవభారత్ గాంధీనగర్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బానోతు బాలు నాయక్, అధ్యక్షుడిగా బానోతు రాము నాయక్, ప్రధాన కార్యదర్శిగా వాంకుడోతు లాలు నాయక్, ట్రెజరర్‌గా బానోతు వీరన్న, మంగీలాల్, వైస్ ప్రెసిడెంట్‌గా గుగులోతు రాంబాబు, బన్నీ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మాలోతు వీరన్న, బానోతు సాగర్, జాయింట్ సెక్రటరీలుగా గుగులోతు లచ్చిరాం, దీప్‌సింగ్‌లను ఎన్నుకున్నారు.

### బీసీ వసతి గృహంలో ఆటల పోటీలు



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం బీసీ బాలుర వసతి గృహంలో శనివారం అండర్ 14, అండర్ 17 ఖోఖో, కబడ్డీ, రన్నింగ్, వాలీబాల్ ఆటల పోటీలు నిర్వహించారు. బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించడం వారిలో నైపుణ్యం, ఉత్సాహం పెంచుతుందని గృహం అధికారి కే.హేమంతరావు తెలిపారు. కార్యక్రమంలో పీటీ సురేష్ పాల్గొన్నారు.

### విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లను అందజేస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: మండల పరిధి యానంబైల్ గ్రామంలోని హైస్కూల్ విద్యార్థులకు తాళ్లూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్, నీలిమా సౌజన్యంతో శనివారం 12 సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య, మాజీ ఎంపీటీసీ వల్లూరిపల్లి వంశీకృష్ణ, విజయ, రేణుక, సుజాత, హెచ్‌ఎం ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

### దుమ్ము, ధూళితో ఇబ్బంది పడుతున్నాం..



దాసుతండా వద్ద నిలిచిన వాహనాలు

టేకులపల్లి: రోడ్డు నిర్మాణం సగంలో నిలిపివేయడం వల్ల కేటీపీ నుంచి వచ్చే బొగ్గు లారీలతో రోడ్డుపై దుమ్ము, ధూళితో అనారోగ్యం పాలవుతున్నామని దాసుతండా, రేగులతండా ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం రాత్రి రోడ్డుపై రాళ్లు పెట్టి వాహనాలను నిలిపివేసి నిరసన తెలియజేశారు. దీంతో కేటీపీ నుంచి బొగ్గులోడు లారీలు, టిప్పర్లు, ఇతర వాహనాలు, కేటీపీకి వెళ్లే వాహనాలతో పాటు ఆర్టీసీ బస్సులు కూడా నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సింగరేణి అధికారి ఇచ్చిన హామీ మేరకు స్థానికులు ఆందోళన విరమించారు.



అడవిలో కొలువైన వనదేవతల గద్దెలు



దండగుండాలలో గుట్టల మీదుగా జాలువారుతున్న జలధార



జాన్‌కాప్‌షాహి దర్గా

# పిక్నిక్‌కు పోదాం రండి..

విహారానికి వేళయింది.. ప్రకృతి అందాలు రారమ్మని పిలుస్తున్నాయి. ఉరుకులు పరుగుల జీవితం నుంచి ఉపశమనం కలిగించే మాసమిది. కార్తీకం ఆరంభంతోనే పిక్నిక్‌కు ఎక్కడికి వెళ్లాలన్న ఆలోచనలు మొదలవుతాయి. పిల్లల సరదాలైతే మరీనూ.. వారాంతం కోసం ఎదురుచూస్తారు. వచ్చే ఏడాది వరకూ గుర్తుండిపోయేలా విహారయాత్ర మధురానుభూతిని మిగల్చాలి. అంతటి ఆనందాన్ని మధురస్మృతులను, కొత్త బంగారు లోకాన్ని చూపించే ప్రకృతి సుందర ప్రదేశాలు ఇల్లెందు ఏజెన్సీలోనూ ఉన్నాయి.

- కార్తీక వనభోజనాల సందడి
- ఇల్లెందు చుట్టుపక్కల అడుగడుగునా అందాలు
- ప్రకృతి సోయగం ఏజెన్సీ సొంతం

సండే స్పెషల్

ఇల్లెందురూరల్: ఇల్లెందు మండలం సరిహద్దులో సుమారు 50 కిలోమీటర్ల దూరం విస్తరించి ఉన్న పాండవుల గుట్టలు సుందర దృశ్యాలకు ఆలవాలం. ఈ గుట్టలపై పలుచోట్ల జాలువారుతూ కనిపించే జలపాతాలు వీక్షకులకు అమితానందాన్ని ఇస్తాయి. ముఖ్యంగా పాండవులు వనవాసం సమయంలో ఇక్కడే విడిది చేశారని ప్రచారంలో ఉంది. గుట్టపై వారు తవ్విన బావి నుంచి వచ్చిన జలధారతో గుట్టపై ఏర్పడిన ఏడు బావులు రాష్ట్రంలో పేరెన్నికగన్నాయి. ప్రస్తుతం పచ్చదనంతో అల్లుకుపోయిన ఇక్కడి సుందర దృశ్యాలు పర్యాటకులను మైమరపిస్తాయి.

**సహజసిద్ధమైన జలపాతాలు...**

మండలంలోని దండగుండాల గ్రామం చుట్టూ సహజసిద్ధంగా ఏర్పడిన అద్భుతమైన జలపాతాలే దర్శనమిస్తాయి. ఇక్కడ ఏడాది పొడవునా జలధార జాలువారుతూనే ఉంటుంది. సమీపంలోని అడవిలో గుట్టలపై నుంచి రాళ్లమధ్యగా జాలువారే జల దృశ్యాలు చూపరులను ఆకట్టుకుంటాయి. పచ్చని అడవిలో.. పక్షుల కిలకిలల నడుమ.. జలపాతాలు వీక్షకులను కొత్తబంగారు లోకంలోకి తీసుకెళ్తాయి.

**ప్రకృతి అందాలకు నెలవైన దర్గా..**

ఇల్లెందు పట్టణానికి అతిసమీపంలో దట్టమైన అటవీ ప్రాంతంలో మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే నాగుల్‌మీరా కొలువు దీరి ఉన్నారు. ఈ ప్రాంతం భక్తిభావాన్ని అందించడంతోపాటు ప్రకృతి అందాలకు, సుందర దృశ్యాలకు వేదికగా నిలుస్తుంది. దర్గా నిర్వాహకుల పర్యవేక్షణలో ఏపుగా పెరిగిన పచ్చని సంపద అహ్లాదాన్ని పంచుతుంది. ఇక్కడికి వెళ్లిన వారికి చూసిన కొద్దీ చూడాలనిపించే వివిధ రకాల పూల మొక్కలు, పండ్ల మొక్కలు, పలు జాతులకు చెందిన పక్షులు, కోళ్లు, కుందేళ్లు అనేకం మిమ్ములను ఆశ్చర్యచకితులను చేస్తాయి.

**నయా అందాల నేచర్ పార్క్...**

ఇల్లెందుకు తీపిగుర్తుగా ఉన్న కోరగుట్టను ఇటీవల అటవీశాఖ అధికారులు పిక్నిక్ స్పాట్‌గా తీర్చిదిద్దారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో నేచర్‌పార్క్‌గా గుట్టను తీర్చిదిద్దారు. గుట్టపైకి చేరుకునేలా రోడ్డు నిర్మించారు. గుట్ట చుట్టూ అహ్లాదాన్ని అందించే వివిధ రకాల పూల మొక్కలు, పండ్ల మొక్కలను నాటారు. పార్క్‌ను వీక్షించేందుకు వచ్చే పర్యాటకులు అక్కడక్కడ విడిది చేసేందుకు అనువుగా నిర్మాణాలు పూర్తి చేశారు. సహజత్వాన్ని ప్రతిబింబించేలా రూపుదిద్దుకున్న నేచర్‌పార్క్‌లో సుందర దృశ్యాలను చూసేందుకు పర్యాటకులు ఇప్పుడిప్పుడే క్యూ కడుతున్నారు.

**వనదేవతల విడిది ప్రాంతం...**

మేడారం సమ్మక్క – సారలమ్మ ఆలయం తరువాత అంతటి పేరెన్నిక గన్నది బొజ్జాయిగూడెం వనదేవతల ఆలయం. ప్రతి రెండేళ్లకోసారి అమ్మవార్ల జాతర ఇక్కడ అత్యంత వైభవంగా జరుగుతుంది. జాతర సమయంలో వనదేవతలను దర్శించుకునే లక్షలాది మంది భక్తులు ఆ తరువాత కూడా అమ్మవార్ల సన్నిధికి పలు సందర్భాలలో వస్తుంటారు. వనదేవతల ఆలయం చుట్టూ ఉన్న దట్టమైన అడవి భక్తులకు భక్తిభావంతోపాటు అహ్లాదాన్ని పంచుతుంది.



పాండవుల గుట్టపై ఏడుబావుల జలపాతం

**వనభోజనాలకూ అనువైనవే...**

కార్తీక మాసం వచ్చిందంటే భక్తిభావంతో భగవంతున్ని ఆరాధించడంతోపాటు అంతా వనభోజనాలకు సిద్ధమైపోతుంటారు. ఇందులో పల్లె, పట్టణం తేడా ఉండదు. వృత్తి, సామాజిక వర్గం, వయోభేదం ఉండదు. నిత్యజీవితంలో ఉండే హడావుడిని పక్కన పెట్టి కార్తీకం తెచ్చే వనభోజనాలలో ఒక్క రోజైనా హాయిగా గడుపుదామని ప్రణాళికలు వేసుకుంటున్నారు. ఇలా ఆనందాన్ని, అనుబంధాల్ని, మధురానుభూతుల్ని పదిలం చేసుకునేలా కార్తీక మాసంలో నిర్వహించుకునే వనభోజన మహోత్సవాలకు కూడా ఇల్లెందు ఏజెన్సీ అనువుగా ఉంటుంది.

### సహజత్వమే అహ్లాదాన్నిస్తుంది..



సహజసిద్ధంగా ఏర్పడిన ప్రకృతి అందాలను వీక్షిస్తే ఆనందం రెట్టింపవుతుంది. అటువంటి ప్రదేశాలకే పిక్నిక్‌కు వెళ్లాలి. స్థానికంగానూ అబ్బురపరిచే సుందర ప్రదేశాలు ఉన్నాయి. ఒకసారి వీక్షిస్తే మళ్లీ మళ్లీ చూడాలనిపించే అందాలు ఇల్లెందు ఏజెన్సీ సొంతం. ప్రచారం లేకే పర్యాటకుల సందడి తగ్గింది.

– వేముల సుగుణ, బాలాజీనగర్

### వనభోజనాలు మధురానుభూతి..



సహజసిద్ధంగా కొలువుదీరిన ప్రకృతి అందాలు ఇల్లెందు ఏజెన్సీలో అనేకం ఉన్నాయి. వీటికి తోడు సహజత్వం ఉట్టిపడేలా అందాలను, భక్తిభావాన్ని పంచే నిర్మాణాలకూ కొదవలేదు. ఇలాంటి చోట వనభోజన మహోత్సవాలు జరుపుకుంటే ఆ అనుభూతి వచ్చే ఏడాది వరకు మధురస్మృతిగా నిలుస్తుంది.

– కూరపాటి పార్వతి, తిలక్‌నగర్

# హామీలన్నీ నెరవేరుస్తాం..

టేకులపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని ఆ దిశగానే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి మండలి కృషి చేస్తోందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు శనివారం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డులోని రైతు వేదికలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలానికి చెందిన 64 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగభవానీ, ఎంపీఓ జేఎల్ గాంధీ, కోరం సురేందర్, భూకా దేవానాయక్ పాల్గొన్నారు.



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

**సర్వేపై భయాందోళనలు వద్దు..**

సమగ్ర కుటుంబ సర్వే ద్వారా సేకరించిన సమాచారం ప్రభుత్వ ఆధీనంలో సురక్షితంగా ఉంటుందని, సర్వే విషయంలో ప్రజలు ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు శనివారం కోయగూడెంలోని స్వగృహంలో ఎమ్మెల్యే కుటుంబానికి సంబంధించిన సర్వే జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమగ్ర కుటుంబ సర్వే విషయంలో ఎలాంటి అపోహలు, అనుమానాలకు తావులేదని ప్రజలు నిర్భయంగా వివరాలు చెప్పి ఎన్యుమరేటర్లకు సహకరించాలని కోరారు.

# సింగరేణి స్థలాల ఆక్రమణను నియంత్రించాలి



మాట్లాడుతున్న జీఎం లక్ష్మీనారాయణ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థకు సంబంధించిన స్థలాలు ఆక్రమణకు గురికాకుండా అడ్డుకట్ట వేయాలని జనరల్ మేనేజర్ (సెక్యూరిటీ) చందా లక్ష్మీనారాయణ సూచించారు. కొత్తగూడెంలోని సెక్యూరిటీ కార్యాలయంలో శనివారం వివిధ ఏరియాల సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ... సింగరేణి వ్యాప్తంగా చోరీలను అరికట్టేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడమే కాక సిబ్బందిని అప్రమత్తం చేయాలని సూచించారు.

అలాగే, స్థలాలు ఆక్రమణకు గురికాకుండా నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. వెహికిల్ ట్రాకింగ్ సిస్టమ్ అమలు, స్క్రాప్ తరలించే సమయాన పర్యవేక్షణపై దృష్టి సారించాలన్నారు. పర్మనెంట్ సెక్యూరిటీ సిబ్బంది సంఖ్య తగ్గడం, ప్రైవేట్ సంస్థలపై ఆధారపడుతున్న అంశంపై యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఆ తర్వాత మాజీ సైనికులను సెక్యూరిటీ సూపర్‌వైజర్లుగా నియమించడం తదితర అంశాలపై జీఎం చర్చించారు. ఈ సమావేశంలో ఎస్‌ఓటూ జీఎం వేణుమాధవ్, సెక్యూరిటీ ఆఫీసర్లు జాకీర్ హుస్సేన్, వి.శ్రీనివాస్‌రావు తదిరులు పాల్గొన్నారు.

# సీపీఎం మహాసభను జయప్రదం చేయండి

టేకులపల్లి: భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్టు) టేకులపల్లి మండల 7వ మహాసభ ను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు రేపాకుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. టేకులపల్లి మండల కేంద్రంలో ఆదివారం సీపీఎం మండల మహాసభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతీ మూడు సంవత్సరాలకు ఒకసారి గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు పార్టీ మహాసభలు జరుగుతాయని, ఇప్పటివరకు నిర్వహించిన పోరాటాలు, ఉద్యమాలు, పార్టీ నిర్మాణాన్ని సమీక్షించుకుని ప్రస్తుత పరిస్థితుల్లో రాబోయే మూడు సంవత్సరాలు ఏ అంశాల మీద పనిచేయాలో మహాసభలో దిశా నిర్దేశం తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈసం నరసింహారావు, కడుదుల వీరన్న, కుంజ రమేష్, పూనెం చంద్రశేఖర్, దనసరి వీరస్వామి, గొగ్గెల బాలకృష్ణ, ఈసం రామకృష్ణ, దనసరి సుదర్శన్, పూనెం సురేష్, చింత శ్రీనివాస్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్


### జిల్లా మహాసభను జయప్రదం చేయండి

జూలూరుపాడు: జూలూరుపాడులో సోమవారం ఆర్కే ఫంక్షన్‌లో జరగనున్న ఎమ్మార్పీఎస్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సంఘం మండల అధ్యక్షుడు దిబ్బెందుల సాయికుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ... జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు హాజరు కావాలన్నారు.

### టీకాలు వేయాలి

ఇల్లెందురూరల్: ఐదేళ్లలోపు పిల్లలకు నిర్దేశించిన గడువులో టీకాలు వేయాలని కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ లోహిత సూచించారు. ఇర్పవారిగుంపు గ్రామంలో శనివారం వైద్యసిబ్బంది చేపట్టిన టీకాల కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. గ్రామంలో చిన్నారులు ఎంతమంది ఉన్నారు. గడువు తేదీ, రికార్డులను పరిశీలించారు. తల్లిదండ్రులకు అవగాహన లేకున్నా వారికి టీకా ప్రాధాన్యతను వివరించి సకాలంలో వేయాలని సూచించారు.

### ఐఎన్‌టీయూసీ ఇన్‌చార్జ్‌గా సత్యనారాయణ



ఇల్లెందు: ఐఎన్‌టీయూసీ అనుబంధ సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ లేబర్ యూనియన్ ఇల్లెందు ఇన్‌చార్జ్‌గా గోచికొండ సత్యనారాయణను నియమించారు.ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనక్ ప్రసాద్ శనివారం వివరాలు వెల్లడించారు.

### ఏఐటీయూసీ నేతల వ్యాఖ్యలు గర్హనీయం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి అనునిత్యం పాటుపడుతున్న ఐఎన్‌టీయూసీపై ఏఐటీయూసీ చేసిన వ్యాఖ్యలు సరికాదని ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ.రజాక్ అన్నారు. కొత్తగూడెంలోని రుద్రంపూర్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏఐటీయూసీ నాయకులు గతంలో వ్యవహరించిన తీరును గుర్తుంచుకుని మాట్లాడాలని సూచించారు. ఇటీవల గోదావరిఖనిలో వారు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంతికుమార్, విప్లవరెడ్డి, కుమారస్వామి, చిలక రాజయ్య, ఎండీ.సత్తార్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

# పకడ్బందీ ఏర్పాట్లు చేశాం..

కొత్తగూడెంటౌన్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్‌సీ) ఆధ్వర్యంలో ఆదివారం జరగనున్న గ్రూప్–3 పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు, అభ్యర్థులు సమయానికి చేరుకోవాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ కోరారు. శనివారం చుంచుపల్లి విద్యానగర్ కాలనీలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్

**పాల్వంచలో 13కేంద్రాల ఏర్పాటు..**

పాల్వంచరూరల్: నేడు రేపు నిర్వహించనున్న గ్రూప్–3 పరీక్షలకు మండల, పట్టణ పరిధిలో 13 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ వివేక్ శనివారం తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సాంఘిక సంక్షేమ బాలుర (సీఓఈ) కళాశాల, కేఎల్‌ఆర్ ఇంజనీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, జూనియర్ కళాశాల, రెజినా కాన్వెంట్, అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల, డీఏవీ స్కూల్, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, గౌతమీ స్కూల్, గిరిజన ఆశ్రమ పాఠశాల, నారాయణ స్కూల్‌లో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ పరీక్షకు 5,592 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు.

**సుజాతనగర్‌లో మూడు కేంద్రాలు..**

సుజాతనగర్: ఆది, సోమవారాల్లో జరగనున్న గ్రూప్–3 పరీక్షలకు అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో రెండు, ధన్వంతరీ ఫార్మసీ కళాశాలలో ఒక కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మొత్తం 1,368 అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పరీక్ష సమయానికి అరగంట ముందే సెంటర్ల గేట్లు మూసివేస్తామని, ఒక్క నిమిషం ఆలస్యం అయినా లోపలికి అనుమతించరని తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ: అన్నివర్గాల ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పట్టణంలోని కరకవాగు బంజరా కాలనీలో శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన వంద కుటుంబాలు బోడా భీమా నాయక్, భట్టు రాందాస్ నాయక్, శ్రీనివాస్, బానోతు దివ్య, స్వామి ఆధ్వర్యంలో కూనంనేని సమక్షంలో సీపీఐలో చేరారు. వీరికి పార్టీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. వందేళ్ల ఘన చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. డిసెంబర్ 26న గ్రామ గ్రామాన వందేళ్ల ఉత్సవాలు ఘనంగా నిర్వహించి, త్యాగాలను స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, వి.పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావ్, వై.వెంకట్రామయ్య, మన్నెం వెంకన్న, రెహమాన్, కరీం, జకరయ్య, సత్యనారాయణ, గిరి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సృజనాత్మకతకు పదును పెట్టండి..

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థుల్లోని సృజనాత్మకతకు మరింత పదును పెడితే వారు జీవితంలో ఉన్నత స్థాయికి చేరతారని శ్రీరామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వనజ అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆవరణలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వనజ మాట్లాడుతూ... ఒకే వేదికపై ఇంతమంది చిన్నారులను చూస్తుంటే ముచ్చటేస్తుందన్నారు.

తన చిన్ననాటి రోజుల్లో చదువుకోటానికి సౌకర్యాలు లేవని, ప్రస్తుతం సౌకర్యాలు పెరిగాయని చెప్పారు. బతుకు గమనాన్ని మార్చుకునే శక్తి కేవలం ఒక చదువుకు మాత్రమే ఉందని, పేదపిల్లలు కూడా గొప్పగా తయారు చేసే ఏకైక సాధనం చదువు ఒక్కటే అన్నారు. ఇలాంటి గ్రంథాలయాల ద్వారా చదువుకునేందుకు అవకాశాలు దొరుకుతున్నాయని, తలదించి పుస్తకాన్ని చదివితే అదే పుస్తకం నిన్ను తల ఎత్తుకునేలా చేస్తుందన్నారు. అనంతరం వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాలకురాలు జి.మణి మృదుల, పాలకులు మధుబాబు, నాగన్న, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వనజ

# సింగరేణి క్యాంటీన్ ప్రారంభం



ఉద్యోగులతో కలిసి అల్పాహారం తింటున్న జీఎం జాన్‌ఆనంద్

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం కార్యాలయం వద్ద క్యాంటీన్‌ను జీఎం జాన్ ఆనంద్ శనివారం ప్రారంభించారు. మాట్లాడుతూ... సింగరేణి సంస్థ ఉద్యోగుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతీ ఉద్యోగి ఈ క్యాంటీన్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏరియా జీఎం కార్యాలయం, వర్క్ షాప్, సీహెచ్‌పీ ఉద్యోగులకు ఈ క్యాంటీన్ అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం సివిల్ రవికుమార్, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, అధికారుల సంఘం అధ్యక్షుడు శివప్రసాద్, బాలాజీనాయుడు, ధనుంజరెడ్డి, మధుబాబు, క్రిష్టఫర్, దిలీప్‌కుమార్, మహేష్, నాగేశ్వరరావు, కార్మిక సంఘాల ప్రతినిధులు సారయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**ఆస్పత్రిని తనిఖీ చేసిన జీఎం..**

సింగరేణి ఇల్లెందు ఏరియా ఆస్పత్రిని జీఎం జాన్ ఆనంద్ తనిఖీ చేశారు. శనివారం అకస్మికంగా రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు.

# కార్మికుల సమస్యలపై వినతిపత్రం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమ స్యలపై శనివారం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేం రాజుకు ఏఐటీయూసీ బృందం వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ...

రుద్రంపూర్ ఆస్పత్రిలో వారానికి కనీసం మూడు రోజులు మహిళా నర్సును విధులకు కేటాయించాలని, రెండోషిఫ్ట్, మూడోషిఫ్ట్‌ల లో వైద్యులను ఏర్పాటు చేసి కార్మిక కుటుంబాలకు వైద్యసేవలు అందించాలని సూచించారు. రామవరం సాధన గ్రౌండ్‌లో ఓపెన్ జిమ్, కమ్యూనిటీ హాల్‌లో ఏసీ సౌకర్యం, అంబేద్కర్, గణేష్ చెమస్‌ల లో పిల్లలు ఆడుకోవటానికి ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన జీఎం వీలైనంత త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

# బూడిదతో కాలుష్యం ముప్పు పొంచి ఉంది..



నినాదాలు చేస్తున్న నాయకులు

పాల్వంచ: ఐటీడీఏ అధికారులు ఎంపిక చేసిన గిరిజనులకు జెన్‌కో యాజమాన్యం బూడిద తరలింపుకు ఆదేశాలు ఇవ్వాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 11వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలు ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. బూడిద తరలింపు ఆలస్యం కావడంతో పాల్వంచకు కాలుష్య ముప్పు మరింత పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్య ప్రభావిత ప్రాంతాల్లోని గిరిజనులకు న్యాయం చేయాలని, ఆందోళన చేస్తున్నా అధికారుల్లో చలనం లేదని, త్వరలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య గౌడ్, భూక్యా చందు నాయక్, కాలే ప్రసాద్, మహేశ్వరం వేణు, బాలు నాయక్, బానోతు రాము నాయక్, కొర్రా రాములు, భూక్యా రవీందర్, డి.చందర్, బి.కృష్ణ, పరిషా, రవి, జవహర్‌లాల్, వీరు, గాంధీ, సీతారాం, బి.లక్ష్మణ్, బి.హరీష్, బి.కృష్ణ, బి.నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.